క్లుప్తంగా

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

మంగళగిరి: నగరంలో మంగళగిరి పాతబస్టాండ్ సెంటర్‌లోగల వైష్ణవి కల్యాణ మండపంలో బుధవారం లేపీకి మరొక్కసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు కావాలంటే(వై ఏపీ నీడ్స్ జగన్)పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు పార్టీ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్‌లు రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)లతో పాటు పార్టీ నియోజకవర్గ పట్టణ రూరల్ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని వై ఏపీ నీడ్స్ జగన్ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా రక్షణభేరిని జయప్రదం చేయాలి

తాడేపల్లిరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజారక్షణభేరిని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం దుగ్గిరాల గ్రామంలోని పలుప్రాంతాల్లో సీపీఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారం చేపట్టిన నాటినుంచి నిత్యావసర వస్తువుల ధరలను పెరిగాయని, కార్మిక హక్కుల్ని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని అన్నారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, కృష్ణ నాయక్, రాములు పాల్గొన్నారు.

కుండల తయారీపై అవగాహన



తాడేపల్లిరూరల్: దీపావళి సందర్భంగా ఏసీఐసీ కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుండల తయారీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఐసీ సీఈఓ వల్లభనేని రామస్‌కాంత్ మాట్లాడుతూ నాలుగు రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మూడు రోజుల పాటు కుండల తయారీ పద్ధతిని, మట్టిలోని రకాలు, వాటి గుణాలు, కుండ కోసం మట్టిని ఎలా తయారు చేయాలో, దాని విధానం గురించి విద్యార్థులకు వివరించామని తెలిపారు. కుండల తయారీ పద్ధతిని అలాగే కుండలు కాల్చే విధానం గురించి కుండల తయారీ కళాకారుడు ఏడుకొండలు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో వివిధ రకాల ప్రమిదలను మట్టితో తయారు చేయించారు. విద్యార్థులకు కుండలపై చిత్రాలను ఆకర్షణీయంగా ఎలా వేయాలో రాధా గాయత్రి, మమతలు వివరించారని అన్నారు. ఈకార్యక్రమంలో కేఎల్ఈఎఫ్ సీఈఓ గోవిల్ అలోక్, వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దోగిపర్రు ఉర్దూ పాఠశాలలో తనిఖీలు



మేడికొండూరు: మండల పరిధిలోని దోగిపర్రులోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం మంగళవారం తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు వర్క్‌ను పరిశీలించి అభినందించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత ఉండేలా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

నీరే జీవితం.. జీవితమే నీరు

నెహ్రూనగర్: నీటి శుభ్రతపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మెప్మా పీడీ పి. వెంకట నారాయణ, నగరపాలక సంస్థ డీఈఈ హనీఫ్ తెలిపారు. అమృత్ 2.0, దీన దయాళ్ అంత్యోదయ యోజన కార్యక్రమంలో భాగంగా నేషనల్ లైవ్లీ హుడ్ మిషన్ ఆధ్వర్యంలో 'నీటి దీపావళి' పేరిట నీళ్ల కోసం మహిళలు, మహిళలు కోసం నీళ్లు అనే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా మంగళవారం తక్కెళ్లపాడులోని హెడ్ వాటర్ వర్క్స్‌లో మహిళలకు నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన నీరు తాగాలని సూచించారు. నీరే జీవితం...జీవితమే నీరని పేర్కొన్నారు. ప్లాంటులో నీటి శుద్ధీకరణ ప్రక్రియను మహిళలకు దగ్గరుండి డీఈఈ హనీఫ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ సాంబశివరావు, సీఎంఎం నాయక్, లత, ప్రభావతి పాల్గొన్నారు.

రోడ్ల పక్కన నాటిన 493 మొక్కలేవీ?!

- 1180 బస్తాల సిమెంట్‌ను ఇతర నిర్మాణాలకు ఉపయోగించారు
- సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో వివరాలు వెల్లడించిన ఆడిట్ బృందం



ఆడిట్ నివేదికను వెల్లడిస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకం ఆడిట్ బృందం

తాడికొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోడ్ల కిరువైపులా నాటిన 493 మొక్కలు కనిపించడం లేదని, ఓ నిర్మాణానికి తీసుకున్న సిమెంట్ బస్తాలను, మరో నిర్మాణాలకు ఉపయోగించడం ద్వారా 1180 బస్తాల సిమెంట్ వివరాలు అందుబాటులో లేవని ఆడిట్ బృందం వివరాలు వెల్లడించింది. డ్వామా పీడీ యుగంధర్ అధ్యక్షతన మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో ఆడిట్ బృందం వివరాలను వెల్లడించింది. తాడికొండ మండలం దామరపల్లి, ఫణిదరం, మోతడక గ్రామాల్లో మొత్తం 1200 మొక్కలు నాటినట్లు నమోదు చేశారని, అయితే వాటిలో రూ.47,383 విలువ చేసే 493 మొక్కలు రోడ్లకు ఇరువైపులా కనిపించలేదని వెల్లడించగా తిరిగి ఆ మొక్కలను నాటించాలని సూచించారు. కాగా ప్రతి ఏటా ఆయా గ్రామాల్లో ఇదే పరిస్థితి వస్తుందని, మొక్కల ప్లాంటేషన్‌లో లోపాలు వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ రాజ్ విభాగం ద్వారా బండారుపల్లిలో బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి 300 బస్తాలు, దామపల్లి డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి 340, పొన్నెకల్లు బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి 540 బస్తాలు సిమెంట్ వినియోగించేందుకు కేటాయించగా అక్కడ ఆ నిర్మాణాలు జరగలేదని వివరాలు వెల్లడించారు. అయితే రెండు సంవత్సరాల క్రితం ఇచ్చిన ఆ సిమెంట్ బస్తాలు నిరుపయోగంగా ఉండి నిర్మాణాలు ప్రారంభించని కారణంగా గడ్డకట్టే ప్రమాదం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలలో తీర్మానం చేసి ఇతర నిర్మాణాలకు వినియోగించామని అందుకు తగిన ఆధారాలను కూడా ఆడిట్ బృందానికి అందించామని పీఆర్ ఏఈ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. రోజువారీ కూలీలకు సంబంధించి 200 మస్టర్‌లు మండలంలో పలు గ్రామాల్లో లోపాలు ఉండగా వాటిని రికవరీ చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ యుగంధర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకంలో ఉపాధి లేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, ప్రతి వ్యక్తికి 100 రోజుల పనిదినాలు ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మీ, ఏపీఓ జయకుమార్, ఎస్ఆర్‌పీ రాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పాడిరైతులకు రుణాలు

పశుసంవర్ధక శాఖ జేడీ జేపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జేపీ వెంకటేశ్వర్లు

ఫిరంగిపురం: జగనన్న పాలవెల్లువలో భాగంగా గ్రామాల్లో పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన అమూల్ పాల ఉత్పత్తి కేంద్రాల్లో పాలశాతం పెంచేందుకు కృషిచేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జేపీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న పాలవెల్లువలో రిజిష్టర్ అయిన పాడి రైతులకు రుణాల విషయంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమూల్ పాలకేంద్రాల్లో పాలుపోసే రైతులు రిజిష్టర్ అయి ఉంటే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. చిన్నతరహా రుణాలలో భాగంగా కో–ఆపరేటివ్ బ్యాంకు ద్వారా పాడిరైతులకు రూ. 30వేల వరకు రుణం ఇస్తారని చెప్పారు. ఇతరబ్యాంకుల ద్వారా ఆరుగేదెల కొనుగోలుకు రూ.లక్షాయాభై వేల వరకు రుణసదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పెద్ద తరహా రుణాల్లో భాగంగా డీఆర్‌డీఏ అధికారుల చొరవతో పాడిరైతులకు శ్రీనిధి, చేయూత వంటి వాటి ద్వారా రుణాలు అందజేస్తారని చెప్పారు. మండలంలో రిజిష్టర్ అయిన పాడి రైతులు 586 మంది ఉండగా వారిలో 126 మంది మాత్రమే పాలు పోస్తున్నారని మిగిలిన వారిచే పాలు పోయించేందుకు కృషిచేయాలన్నారు. రిజిష్టర్ అయిన ప్రతి పాడి రైతుకు రుణం లభించేలా కృషిచేస్తామని చెప్పారు. సమావేశంలో డీడీ కేవీ సత్యనారాయణ, డీసీఓ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి కోటిరత్నం, ఏపీఎం సుజాత, పశువైద్యసిబ్బంది, డీఆర్‌డీఏ సిబ్బంది, అమూల్ పాల సెక్రటరీలు, పాడి రైతులు పాల్గొన్నారు.

సీవీ రామన్ స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశం గర్వించే గొప్ప శాస్త్రవేత్త సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థినులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సూచించారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ జయంతిని మంగళవారం సాంబశివపేటలోని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థినులు బయో సెన్సార్, నానో మెటీరియల్స్ ఇన్ టెక్స్‌టైల్స్ అండ్ త్రీడీ ప్రింటింగ్ అంశాలపై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలు జి. శిరీష, డాక్టర్ జె. నిశ్చల్ కిరణ్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి



గుంటూరు ఈస్ట్: బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కొత్తపేట ఎస్‌హెచ్‌వో అన్వర్ బాషా తెలిపారు. సిబ్బందితో కలసి సోమవారం అర్ధరాత్రి స్టేషన్ పరిధిలో ప్రత్యేక గస్తీ నిర్వహించారు. రైల్వేస్టేషన్, నాజ్ సెంటర్, నెహ్రూనగర్, తదితర ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్లారు. తెరిచి ఉంచిన షాపుల్ని మూయించారు. బహిరంగరంగా మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 10 గంటల తరువాత షాపులు తెరచి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, నిషేధిత గుట్కాలు వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే 100, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వర్క్ ఎస్టిమేషన్లపై అవగాహన సదస్సు



వర్క్ ఎస్టిమేషన్ సదస్సులో పాల్గొన్న జిల్లా ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ జి.బ్రహ్మయ్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తెనాలి నియోజకవర్గాలకు సంబంధించి జరిగిన అభివృద్ధి పనులపై వర్క్ ఎస్టిమేషన్ అవగాహన సదస్సును దుగ్గిరాల గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు జిల్లా ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ జి.బ్రహ్మయ్య రెండు నియోజవర్గాల సచివాలయాల ఇంజినీర్లకు, అసిస్టెంట్ ఇంజినీర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తోందని, పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించేందుకు అవసరమైన వర్క్ ఎస్టిమేషన్ చేయడంలో కొంత జాప్యం జరుగుతోందని ప్రతి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించిందన్నారు. ఆయా సచివాలయాల్లో జరిగిన అభివృద్ధిపై వారికి అవగాహన ఉండాలని, ఎన్ని క్యూబిక్ మీటర్లు అభివృద్ధి చెందింది, ఒక రోడ్డు నిర్మించేటప్పుడు ఎంత పొడవు, ఎంత వెడల్పు నిర్మించారో పూర్తి వివరాలు తీసుకుని ఆయా సచివాలయాల్లో వర్క్ ఎస్టిమేషన్లు తయారు చేస్తే తొందరగా బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉంటుందని, అలా బిల్లులు చెల్లించడం వల్ల మరిన్ని అభివృద్ధి పనులు చేయవచ్చని ఆయన అన్నారు. మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న విజయవాడలో ఉపాధ్యాయుల మహా ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ కోరారు. మంగళవారం జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుడిపాటి దాస్, వి. వందనం, కె. శ్రీనివాసరావు, ఏ. వేణుగోపాలరావు, టి. ప్రభాకర్, సత్యనారాయణ మూర్తి, పి. వేణు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసిన వారికే మాదిగల మద్దతు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

తెనాలిటౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసిన రాజకీయ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని, వర్గీకరణ కోసం పోరాటం చేస్తునే సంక్షేమం, సమగ్రాభివృద్ధి, రాజకీయ వాటా కొరకు మాదిగలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ పొన్నెకంటి రమేష్‌మాదిగ అధ్యక్షత వహించారు. సమావేశంలో బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగల ఆశ, ఆకాంక్ష, ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభలో దేశ ప్రధాని నరేంద్రమోడీ పాల్గొంటారని చెప్పారు. పార్లమెంట్‌లో వర్గీకరణ అంశంపై చట్టం చేయాలని బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్ మాదిగ, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, దొండపాటి సుధాకర్, పానుగంటి షాలేమ్ రాజు, డొక్కా జార్జి, మహిళ నాయకులు లుక్కా బుజ్జి, ప్రశాంతి, నాగమ్మ, యువకులు జాన్‌పాల్, రమేష్, సంతోష్, జాన్‌వెస్లీ, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆమ్ ఆద్మీ పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయాన్ని బుధవారం మంగళగిరి రోడ్డులోని వైష్ణవి కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ టి.సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం ఓటర్ల లిస్టు అందుబాటులో ఉంటుందని, ఓటరు సహాయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఓటర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రెండు చోట్ల చైన్ స్నాచింగ్

గుంటూరు ఈస్ట్: మహిళల మెడలో బంగారు గొలుసులు తెంచుకుని పరారైన ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటీ అగ్రహారం 8వ లైనుకు చెందిన ఇంద్రాణి మంగళవారం ఇంటి ముందు నిలబడి ఉంది. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని రెండు సవర్ల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు. ఇంద్రాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం 4వ లైనుకు చెందిన శ్రీలక్ష్మి మంగళవారం నడుచుకుంటూ 5వ లైనుకు వెళ్లింది. ఈ సమయంలో ఇద్దరు ఆగంతకులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని బంగారు గొలుసును తెంచుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. శ్రీలక్ష్మి ప్రతిఘటించి గొలుసును గట్టిగా పట్టుకుంది. లాకెట్‌ను మాత్రమే ఆగంతకులు తెంచుకుని పరారయ్యారు. శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం ..

బాలిక అదృశ్యంపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంగడిగుంటలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య ..

వ్యక్తి ఆత్మహత్యపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ ఖలీల్ (36) గతంలో బట్టల షాపు నిర్వహించి నష్టాల పాలయ్యాడు. అప్పులు చేసి మానసికంగా కుంగిపోయాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మార్కెట్ మసీదు వద్ద నివాసముండే ఓ మహిళ కనిపించడం లేదంటూ మంగళవారం ఆమె భర్త తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి మార్కెట్ వద్ద నివాసముండే వెల్డింగ్ పనిచేసే తోకల దుర్గారావుకు అదే ప్రాంతానికి చెందిన త్రివేణికి 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. గత నెల 30వ తేదీన వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో మనస్తాపం చెందిన త్రివేణి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో దుర్గారావు తన భార్య కనిపించడంలేదంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ

తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్‌లోని నరేంద్రకాలనీలో మున్సిపల్ ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. యోగా సభ్యులు చరసాని శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీ చైతన్యల కుమారుడు వివిఎస్.రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కఠెవరం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంపల శివనాగేశ్వరరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జరీనా బేగం, సాంబశివరావు, ఉపాధ్యాయులు సుజాత, మాధవి, శిరీషా, నరేంద్రబాబు, కెథారీన్,యోగసాధకులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణ స్థలాల పరిశీలన



అమరావతి రోడ్డులో గల దేవదాయ శాఖ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసుకునే బాణసంచా షాపులు తప్పనిసరిగా నిర్ణయించిన స్థలాల్లోనే ఏర్పాటు చేయాలని అధికారులు వ్యాపారులకు తేల్చిచెప్పారు. మంగళవారం తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు దేవదాయ శాఖ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచా వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే ఉండవల్లి అమరావతిరోడ్డులో గల దేవాలయ భూముల్లో షాపులు ఏర్పాటు చేసుకోవాలని, ఆ షాపు ఏర్పాటు చేసేటప్పుడు పై కప్పుగా రేకులను మాత్రమే వినియోగించాలని, నిర్ణయించిన స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను నిర్ణయించిన ప్రదేశంలో పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని, విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారని అన్నారు. ఈ పరిశీలనలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తాడేపల్లి ఎస్ఐ రమేష్, ఆర్ఐ వంశీకృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషిచేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేద్దామని పార్టీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి క్రిస్టియన్‌పేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, ఇతర నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ తాడేపల్లి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ పార్టీ అధ్యక్షుడు మున్నంగి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి రూరల్ పరిధిలో 41 బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్‌లోను వైఎస్సార్ సీపీ నుంచి ఇప్పటికే కొత్త ఓట్లను చేర్పిస్తున్నారని, వారితో పాటు స్థానికంగా వున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అమరా నాగయ్య, తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, నాయకులు మిరియాల రాంబాబు, నూతక్కి శ్రీను, గొడవర్తి శ్రీనివాసరావు, సంకురు మరియబాబు, బొక్క నాని, నాగిరెడ్డి, తిరుమల రెడ్డి, చిలకయ్య, మేకల సాంబశివరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి బత్తుల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన



పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌సీఐ తాడేపల్లి కేసీ డిపో మేనేజర్ వర్గీస్

తాడేపల్లిరూరల్: పోర్టిఫైడ్ బియ్యం వినియోగంలో అపోహలు వద్దని ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆహార సంస్థ ఆహార నిల్వల గోదాము, కృష్ణా కెనాల్ డిపో ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటైన ఆహార లోపాన్ని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోర్టిఫైడ్ బియ్యం వాడడం వలన రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చని తెలియజేశారు. కృష్ణాకెనాల్ ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శశికళ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కావాల్సిన ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బి12లు ఈ బియ్యంలో లభ్యమవుతాయని వివరించారు. ఆశా వర్కర్లు పోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మెడికల్ ఆఫీస్ డాక్టర్ కిరణ్, సిహెచ్ గురుకుమార్, సి.ప్రమీజా, ఉమాదేవి, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్‌బాబు, తాడేపల్లి కేసీ డిపో సిబ్బంది, క్వాలిటీ సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లో రావెల విద్యార్థినుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం నాగమణి, ఆయుష్ వైద్యాధికారిణి రేష్మ, శిక్షకుడు రాకేష్

రావెల(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యోగా టోర్నమెంట్‌లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపారని పాఠశాల హెచ్‌ఎం నాగమణి, ఆయుష్ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసం గ్రామంలో ఈనెల నిర్వహించిన అండర్–17 యోగా పోటీలకు బాలికల విభాగంలో విద్యార్థులు పాల్గొనగా, వారిలో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు జట్టును విజయ పథంలో నడిపించడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులు పేరుబోయిన వెంకట త్రివేణి, మొఘల్ ఖాజాబీ, పేరుబోయిన భార్గవి, మొక్కల అక్షయలతో పాటు వారికి శిక్షణ అందించిన శిక్షకుడు అన్నవరపు రాకేష్‌ను హెచ్‌ఎం నాగమణి, వైద్యాధికారిణి డాక్టర్ రేష్మలు అభినందించారు.

వానర గోలకు వేషంతో చెక్!



ఇళ్లపై దాడి చేసి, అక్కడ దొరికింది ఎత్తుకెళ్లడం.. దారిన పోయేవారిపై దాడిచేసి, చేతుల్లో ఏముంటే అది లాకెళ్లిపోవడం.. చిన్నారులు, మహిళల వెంటపడి మరీ కరవడం.. ఇలా కోతులు చేసే బీభత్సం అందరికీ తెల్సిందే.. అవి మూకగా దాడిచేశాయంటే ఎంతటివారైనా పలాయనం చిత్తగించాల్సిందే.. అయితే వానరాల పీడకు వినూత్న ఆలోచనతో చెక్‌పెట్టారు తాడికొండ గ్రామ పంచాయతీ పాలకవర్గం. గ్రామంలో కోతుల బాధ భరించలేక ఆన్‌లైన్‌లో కొండముచ్చు సూట్‌ను తెప్పించి, పంచాయతీ వర్కర్‌కు వేయించి, కోతులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తిప్పారు. భారీసైజులో ఉన్న కొండముచ్చు వేషధారిణిని చూసి బెంబేలెత్తిపోయిన వానరమూకలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయాయి. ఈ ఆలోచన సత్ఫలితాలు ఇవ్వడంతో మరో కొండముచ్చు డ్రెస్ తెప్పిస్తున్నట్లు సర్పంచ్ తోకల సరోజిని, కార్యదర్శి పిట్టు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

– తాడికొండ